క్లుప్తంగా

వేసవిలో సమృద్ధిగా తాగునీరు

కాకినాడ: వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన శశికాంత్‌నగర్‌లోని 40 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను సందర్శించారు. గతంలో కెనాల్ ద్వారా వచ్చే నీటి సరఫరా స్థానంలో ప్రస్తుతం వేసవి జలాశయంలోని నీటిని శుద్ధి చేసి ప్రజలకు అందిస్తున్నందున నీటి నాణ్యతపై ఆరా తీశారు. కలుషితనీరు వస్తోందన్న ఫిర్యాదులపై ఎస్ఈ పి.సత్యకుమారి స్పందిస్తూ ఎక్కడా నీరు కలుషితం కాలేదని వివరించారు. ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందిస్తున్నామని ఎటువంటి ఆందోళన చెందాల్సిన పనిలేదని పేర్కొన్నారు. వీరి వెంట వాటర్ వర్క్స్ అధికారులు ఉన్నారు.

అంబేడ్కర్ మార్గం ఆచరణే నిజమైన నివాళి

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి పురందేశ్వరి



కార్యక్రమంలో మాట్లాడుతున్న దగ్గుబాటి పురందేశ్వరి

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): అంబేడ్కర్ ఆశయాలు నెరవేర్చడమే ఆయనకు నిజమైన నివాళి అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ జయంత్యుత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంబేడ్కర్ ఆలోచనా విధానాన్నే బీజేపీ అమలు చేస్తోందన్నారు. అధికారాన్ని బీజేపీ సేవా మార్గంగా భావిస్తుందన్నారు. ప్రధాని మోదీ తాను ప్రధాని అని చెప్పుకోకుండా సేవకుడిగా చెప్పుకుంటారన్నారు. దళితుల సంక్షేమానికి తమ ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. దేశం సురక్షితంగా ఉండాలంటే మోదీ నాయకత్వం తప్పనిసరని పేర్కొన్నారు. బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గుడిసె దేవానంద్, పార్టీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పైడా కృష్ణమోహన్ పాల్గొన్నారు. అనంతరం పార్టీ దక్షిణ మండల అధ్యక్షుడు చెక్కా రమేష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించి మహిళలతో కొద్దిసేపు ముచ్చటించారు. అంతకు ముందు పురందేశ్వరికి సర్పవరం జంక్షన్ నుంచి భారీ బైక్ ర్యాలీతో పార్టీ నాయకులు స్వాగతం పలికారు.

జగన్‌మోహన్‌రావుకు అభినందన



జగన్‌మోహన్‌రావును సత్కరిస్తున్న ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఈ కంటెంట్ రూపకల్పనలో ప్రతిభ చూపిన పిఠాపురం మండలం జెడ్పీహెచ్ఎస్ పల్లాం పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు వైదే జగన్మోహనరావును ఎస్‌సీఈఆర్టీ అభినందించింది. ఈ కంటెంట్ రూపకల్పనకు విజయవాడలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయనను ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి అభినందించారు.

ఆర్‌బీకేల ద్వారా ధాన్యం విక్రయించాలి



వలసపాకలలో ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీఓ

కరప: రబీ ధాన్యాన్ని ఎవరూ త్వరపడి దళారులకు విక్రయించవద్దని, ఆర్బీకేలను సంప్రదించాలని తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఎంపీఓ ఏవీ రాజేష్ రైతులకు సూచించారు. మండలంలోని వలసపాకల, వేములవాడ గ్రామాల్లో ఆయన పర్యటించి కళ్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించి, రైతులతో మాట్లాడారు. ధాన్యం రాశులలో అడుగు ధాన్యాన్ని వేరుచేసి ఆరబెట్టాలన్నారు. ఆర్‌బీకేలను సంప్రదించి, మద్దతు ధర పొందాలని సూచించారు.

ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నారు

కాకినాడ సిటీ: ఉపాధి పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు దడాల సుబ్బారావు విమర్శించారు. శుక్రవారం స్థానిక సుందరయ్యభవన్‌లో సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధి నిధులను వేరే కార్యక్రమాలను తరలిస్తున్నారని అన్నారు. సంఘం జిల్లా అధ్యక్షులు టేకుమూడి ఈశ్వరరావు, జిల్లా కార్యదర్శి కేఎస్ శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

ప్రతి గింజా కొంటాం

- అన్నదాతలకు కలెక్టర్ కృతికా శుక్లా హామీ
- ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు
- 8వ తేదీ తర్వాత పంటనష్టంపై గణన
- అర్హులందరికీ ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా



కరపలో కళ్లంలో ఉన్న ధాన్యాన్ని, జేడీఏ విజయ్‌కుమార్, అధికారులతో కలసి పరిశీలిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కరప: జిల్లాలో రైతు భరోసా కేంద్రాల ద్వారా మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు ప్రక్రియ చురుగ్గా సాగుతోందని కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు. వర్షాలకు తడిసినా, మొలక వచ్చినా కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు రైతులకు భరోసా ఇచ్చారు. ఈ నెల జరుగుతోందని కాకినాడజిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా తెలిపారు.

వర్షాలకారణంగా తడిసిన, మొలకలు వచ్చిన ధాన్యాన్ని ఆర్‌బీకేల ద్వారా కొనుగోలుచేసేందుకు అన్నిరకాల చర్యలు తీసుకోవడం జరిగిందని కలెక్టర్ రైతులకు భరోసాకల్పించారు. ఈనెల 8వ తేదీన పంట నష్టంపై గణన చేయిస్తామని, అర్హులందరికీ ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా మంజూరు చేస్తామని తెలిపారు. శుక్రవారం ఆమె అధికారులతో కలసి కరప, పేపకాయలపాలెం, వలసపాకల గ్రామాల్లో పర్యటించారు. కళ్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని, మొలకలు వస్తున్న వరిపనలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేసి, రైసుమిల్లులకు తరలించాలని ఆమె అధికారులను ఆదేశించారు. అనంతరం ఆర్బీకేలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఆమె పరిశీలించి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. అనంతరం డ్రెయిన్లలో ఉపాధి పథకం ద్వారా గుర్రపు డెక్క, తూటుకాడ తొలగించాలని ఇచ్చిన ఆదేశాలు ఎంతవరకు అమలుచేశారనేది శహపురం డ్రెను పరిశీలించి తెలుసుకున్నారు. మురుగు కాలువలు తవ్వించి చాలాకాలమైందని, శహపురం డ్రెయిన్ గొర్రిపూడి వద్ద తుల్యభాగ డ్రెయిన్‌లో కలిసేచోట బ్రిటిష్ కాలంలో నిర్మించిన ఎల్లేటితూములు శిథిలమయ్యాయని, వాటిని బాగుచేయాలని రైతులు కలెక్టర్‌కు వివరించారు.

జిల్లాలో 65 వేల హెక్టార్లలో వరిసాగు

ఈ సందర్భంగా కలెక్టర్ కృత్తికా శుక్లా స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ రబీలో జిల్లా వ్యాప్తంగా 65 వేల హెక్టార్లలో వరి సాగు చేశారని, ఇందులో 50 శాతం కోతలు పూర్తయ్యాయని, ఇంతలో వర్షాలు ముంచెత్తడంతో రైతులను అప్రమత్తం చేశామన్నారు. ధాన్యాన్ని గోదాంలకు, ఇతర సురక్షిత ప్రాంతాలకు తరలించినట్టు ఆమెతెలిపారు. బొండాలు రకం గట్టిరకం కావడం వల్ల ఆ రకానికి నష్టం జరగలేదన్నారు.

రైతులకు ఆందోళన వద్దు

ఆర్‌బీకేల ద్వారా మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని కలెక్టర్ రైతులకు హామీ ఇచ్చారు. వాతావరణం సాధారణ స్థితికి వచ్చే వరకు కోతలు వాయిదా వేసుకోవాలని తెలిపారు. ప్రత్యేకాధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో రైతులకు సహాయ, సహకారాలు అందించాలని ఆదేశించారు. జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు ఎస్.విజయ్‌కుమార్, పౌరసరఫరాలశాఖ డీఎం డి.పుష్పమణి, తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఎంపీడీఓ కర్రె స్వప్న, ఎంపీఓ ఏవీ రాజేష్, డ్రెయినేజీశాఖ డీఈఈ కె.కీర్తి, ఏపీఓ ఈ.వెంకటరమణ, ఆర్ఐ పి.మాచర్రావు తదితరులు పాల్గొన్నారు.



కరప శివారు పేపకాయలపాలెం వద్ద శహపురం డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ కృతికాశుక్లా

టిడ్కో ఇళ్లకు రుణాలివ్వండి



బ్యాంకర్లతో సమీక్షిస్తున్న ఏడీసీ నాగనరసింహారావు

కాకినాడ: టిడ్కో ఇళ్ల రుణాలను వేగంగా మంజూరు చేయాలని నగరపాలక సంస్థ ఏడీసీ సీహెచ్ నాగనరసింహారావు బ్యాంకర్లను కోరారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం బ్యాంకర్లతో సమావేశమై టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు సుమారు 131 మందికి రూ.3.65 లక్షలు రుణాలు ఇవ్వాల్సి ఉందన్నారు. సమావేశంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సీహెచ్‌వీ ప్రసాద్, వివిధా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉచిత విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం ద్వారా ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతి ప్రవేశాలకు రెండో విడత దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ కేఎస్‌వీఎస్ అన్నపూర్ణ శుక్రవారం తెలిపారు. దరఖాస్తులు ఈ నెల 6వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ గ్రామ, వార్డు సచివాలయం ద్వారా దరఖాస్తు చేసుకోవాలని 22వ తేదీన సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. పూర్తి వివరాల కోసం సమీపంలోని సచివాలయంలో సంప్రదించాలని సూచించారు.

డ్రోన్ ద్వారా అర్బన్ రీ సర్వే



డ్రోన్ ఫ్లయింగ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి, కమిషనర్ మహేష్‌కుమార్ తదితరులు

- ప్రారంభించిన ఎమ్మెల్యే ద్వారంపూడి
- పాల్గొన్న కమిషనర్, ఇతర అధికారులు

కాకినాడ: జగనన్న శాశ్వత భూ హక్కు–భూరక్ష పథకంలో భాగంగా ప్రతిపాదించిన డ్రోన్ ఫ్లైయింగ్ సర్వేను ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. స్థానిక రంగరాయ వైద్య కళాశాల క్రీడా మైదానంలో కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరయ్యారు. ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ సర్వే నంబర్లకు, వాస్తవ పరిస్థితులకు పొంతన లేక ఎదురవుతున్న సమస్యలకు ఈ సర్వే వల్ల పరిష్కారం లభిస్తుందన్నారు. కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటికే సర్వే నెంబర్‌తో ఆస్తుల వివరాలను అనుసంధానం చేస్తున్నట్టు తెలిపారు. ఇప్పుడు డ్రోన్‌ఫ్లైయింగ్ సర్వే కూడా అనుసంధానించి ఈ ప్రక్రియకు తుది రూపు ఇస్తామన్నారు. ఈ ప్రక్రియను షార్ ఐటీ ఆపరేషన్స్ సంస్థ చేపడుతోందని, సుమారు వారం రోజుల వ్యవధిలో మొత్తం నగరాన్ని సర్వే చేస్తుందని చెప్పారు. అనంతరం భూయజమానులకు హక్కు పత్రాలు ఇస్తామని తెలిపారు. కొడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్‌సీపీ నగరాధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, ఏడీసీ సీహెచ్ నాగనరసింహారావు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాల్లో శానిటేషన్ డ్రైవ్

- ఆదివారం నుంచి శ్రీకారం
- కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్
- కాలనీ అసోసియేషన్లతో సమావేశం

కాకినాడ: నిరుపయోగంగా ఉన్న ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు ప్రతి ఆదివారం ఎంపిక చేసిన నాలుగు ప్రాంతాల్లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేపట్టనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల చెప్పారు. కార్పొరేషన్‌తో పాటు కాలనీ అసోసియేషన్లు, స్వచ్ఛంద సేవా సంస్థలను కూడా భాగస్వామ్యం చేస్తామన్నారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం నగరంలోని కాలనీ అసోసియేషన్లతో ఆయన సమావేశమై నగరంలో నిరుపయోగంగా ఉన్న ఖాళీ స్థలాల వల్ల ఎదురవుతున్న సమస్యలపై చర్చించారు. యజమానులు స్థానికంగా ఉండకపోవడం వల్ల అక్కడ అధ్వాన పరిస్థితులు ఎదురవుతున్నాయని, వారి సమాచారం తెలియడం లేదని, అందువల్ల కాలనీ సంక్షేమ సంఘాలు సహకరిస్తే స్థల యజమానుల సమాచారాన్ని సేకరించి ప్రహరీ నిర్మించడం, శుభ్రం చేయించడం వంటి ప్రక్రియ చేపట్టవచ్చునన్నారు. ఈ లోపు ఆయా స్థలాల్లో శుభ్రం చేయాలన్నారు. రానున్న వర్షాకాలానికి ఇది పూర్తవ్వాలన్నారు. సదరు యజమానులకు నోటీసులు పంపుతామని, స్పందించకుంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఏడీసీ సీహెచ్ నాగ నరసింహారావు మాట్లాడుతూ ఇటువంటి స్థలాల వల్ల డెంగీ వంటి అనారోగ్య పరిస్థితులు తలెత్తుతున్నాయన్నారు. ఫెడరేషన్ ఆఫ్ కాలనీస్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు వైడీ రామారావు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి అన్ని కాలనీల సంక్షేమ సంఘాల నుంచి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఫెడరేషన్ ఆఫ్ కాలనీస్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమిరెడ్డి శ్రీరామ నర్సింగరావు, కార్యదర్శి జీవీకే వర్మ, ఆల్ ఈజ్ వెల్ ప్రతినిధి కిషోర్, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, శానిటరీ సూపర్‌వైజర్లు జిలాని, రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వివిధ కాలనీ సంక్షేమ సంఘాల అధ్యక్షులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

బయో మెథనేషన్ ప్లాంట్ సందర్శన

తడి చెత్త నుంచి సీఎన్‌జీ ఉత్పత్తి చేసే బయో మెథనేషన్ ప్లాంట్ త్వరలోనే ఏర్పాటు కానుందని కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్ చెప్పారు. శుక్రవారం ఆయన ప్లాంట్ ప్రతిపాదించిన చొల్లంగి ప్రాంతాన్ని సందర్శించి మాట్లాడుతూ సుమారు ఆరున్నర ఎకరాల విస్తీర్ణంలో రూ.10 కోట్లతో ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఆయన వెంట స్మార్ట్ సిటీ ఎస్ఈ ఎం.వెంకట్రావు, డీఈ రామారావు, స్మార్ట్ సిటీ అధికారులు ఉన్నారు.

ఏబీసీ కేంద్రం సందర్శన

గోలీలపేటలోని యానిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాన్ని కమిషనర్ మహేష్ కుమార్ శుక్రవారం సందర్శించారు. శునకాలకు అక్కడ జరుగుతున్న శస్త్రచికిత్సలను, కేంద్రంలోని వసతులు, వైద్యుల సమాచారాన్ని ఆరోగ్యాధికారి పృథ్వీచరణ్ కమిషనర్‌కు వివరించారు.

ప్రణాళికాబద్ధంగా పూడికతీత పనులు

నిర్ణీత సమయంలో పూడికతీత పనులను పూర్తిచేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో ఇంజినీరింగ్, ప్రజారోగ్య విభాగానికి చెందిన అధికారులతో డి-సిల్టేషన్ పనుల ప్రగతిని సమీక్షించారు.



కాలనీల సంక్షేమ సంఘ ప్రతినిధులతో సమావేశమైన కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్

గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు

కాకినాడ సిటీ: జిల్లాలోని అన్ని గ్రంథాలయాల్లో నిర్వహించే వేసవి విజ్ఞాన శిబిరాలలో పాఠశాల విద్యార్థులు పాల్గొని విజ్ఞానవంతులు కావాలని జేసీ ఎస్.ఇలక్కియ విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ నెల 8వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకు నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలకు సంబంధించి పోస్టర్‌ను శుక్రవారం కలెక్టరేట్‌లో ఆమె ఆవిష్కరించారు. పౌర గ్రంథాలయశాఖ ఆదేశాలకు అనుగుణంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలోని అన్ని శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ ఇలక్కియ

రేషన్ బియ్యం అక్రమ రవాణా

కాకినాడ క్రైం: కాకినాడ ప్రతాప్ నగర్ సమీపంలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఓ వ్యాన్‌ను శుక్రవారం విజిలెన్స్ అధికారులు రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులతో కలిసి పట్టుకున్నారు. ఈ మేరకు రాజమహేంద్రవరం రీజినల్ విజిలెన్స్, ఎన్ఫోర్స్‌మెంట్ అధికారి కె.కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. పట్టుబడ్డ వ్యాన్‌లో 300 కిలోల 16.77 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఆయన తెలిపారు. ఈ క్రమంలో బియ్యాన్ని తరలిస్తున్న వ్యాన్ యజమాని సప్ప వీరబాబు, డ్రైవర్ రాసంశెట్టి స్వామిలపై క్రిమినల్ కేసు నమోదైంది.

శోభాయమానంగా స్వామివారి ఊరేగింపు



నగర వీధుల్లో సాగుతున్న అష్టలక్ష్మి సమేత లక్ష్మీనారాయణస్వామి శోభాయాత్ర

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయం వీధిలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ఈ నెల 11న ప్రతిష్ఠించనున్న అష్టలక్ష్మి సమేత లక్ష్మీనారాయణస్వామి విగ్రహమూర్తులను శుక్రవారం నగరంలో పలు వీధుల్లో ఊరేగించారు. తప్పెడ గుళ్లు, కోలాటం, మేళతాళాలతో ఊరేగింపు వైభవంగా సాగింది. పారిశ్రామికవేత్త కంతేటి కాశీ మాట్లాడుతూ ఈ నెల 11న ఉదయం 9.18 నిమిషాలకు త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి ఆధ్వర్యంలో ఈ ప్రతిష్ఠ జరుగుతుందన్నారు.

బుద్ధుని బోధనలు అనుసరణీయం

బోట్‌క్లబ్: ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం బుద్ధ పూర్ణిమ నిర్వహించారు. స్థానిక జేఎన్‌టీయూకే ప్రాంగణంలోని బుద్ధుని విగ్రహానికి అసోసియేషన్ అధ్యక్షుడు వెదురుపాక సతీష్ పూలమాల వేశారు. అసోసియేషన్ మాజీ అధ్యక్షులు అడ్డాల సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు. అలాగే సిద్ధార్థనగర్ పార్కులో సప్తగిరి మిత్ర బృందం ఆధ్వర్యంలో బుద్ధ జయంతి నిర్వహించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావు బుద్ధుని విగ్రహానికి పూలమాలలు వేశారు.

వాకర్స్ ఆధ్వర్యంలో..

కాకినాడ రూరల్: స్థానిక బోట్‌క్లబ్ ఉద్యానవనంలో వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో బుద్ధ జయంతి శుక్రవారం ఘనంగా జరిగింది. డాక్టర్ జవహర్ మాట్లాడుతూ బుద్ధుని బోధనలు ఆచరణీయమని తెలిపారు. బుద్ధ విహార్ కోశాధికారి రాంప్రసాద్ 'బుద్ధుడు -బౌద్ధ ధర్మం' పుస్తకాన్ని అడబాలకు డాక్టర్ జవహర్ అందజేశారు. ఎస్సీ, ఎస్టీ కాకినాడ రూరల్ సంక్షేమ సంఘ అధ్యక్షుడు ఎం సుబ్బారావు, వాకర్లు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

గడపగడపలో ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: నిత్యం ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం పరితపించే సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్థానిక 11వ డివిజన్ రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో శుక్రవారం గడపగడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. కొడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, అధికారులు ఆయన వెంట ఉన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ నాలుగేళ్ల పాలనలో ప్రజలకు అందించిన లబ్ధిని వివరించారు. అర్హతే ప్రాతిపదికగా నేరుగా లబ్ధిదారులకే ప్రభుత్వ పథకాలను అందిస్తున్న ప్రభుత్వం మళ్లీ మళ్లీ అధికారంలో కొనసాగాలని అన్ని వర్గాల ప్రజలు కోరుకుంటున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఏ ప్రాంతానికి వెళ్ళినా ప్రజల నుంచి మంచి స్పందన కనిపిస్తోందన్నారు. మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, స్థానిక నాయకులు గద్దేపల్లి దాసు, మెర్ల వరలక్ష్మి, బాబూరావు, అలుగోలు శ్రీనివాస్, డీఈ మాధవి, పలువురు అధికారులు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

విశ్రాంత జీవుల సేవలో సంఘం

కాకినాడ సిటీ: జిల్లాలో పెన్షనర్స్ అవసరాలకు తగ్గట్టుగా సేవలు అందించడంతో పాటు వారి ఆరోగ్య విషయాలపై ప్రత్యేక దృష్టి పెట్టి, పలు సేవా కార్యక్రమాల్లో పెన్షనర్స్ సంఘం పాల్గొనడం అభినందనీయమని మాజీ ఎంపీ, ఎమ్మెల్సీ పండుల రవీంద్రబాబు అన్నారు. శుక్రవారం కాకినాడ పెన్షనర్స్ భవన్‌లో సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మన కోసం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతీ నెలా 5వ తేదీన క్రమం తప్పకుండా ఒక కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కాకినాడ ట్రస్ట్ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ ఫణిరామభూషన్, అపోలో ఆస్పత్రి ఆర్థోపెడీషియన్ పి.చటర్జీ పెన్షనర్లకు పలు ఆరోగ్య సలహాలు ఇచ్చారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె పద్మనాభం, పీఎస్ఎస్ఎన్‌పీ శాస్త్రి తదితరులు వారి సమస్యలపై ఎమ్మెల్సీకి వినతిపత్రం అందజేశారు. దీంతో సబ్ ట్రెజరీ కార్యాలయం నుంచి శుక్రవారం సిబ్బంది వచ్చి ఏటీఓ రాజమ్మ పర్యవేక్షణలో 100 మందికి పైగా పెన్షనర్స్‌కు ఈకేవైసీ చేసినట్లు అధ్యక్షులు పద్మనాభం తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీని అభినందించారు. సంఘం నాయకులు షేక్ ఇబ్రహీం, బండి భాస్కరరావు, ఎస్ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ పండుల రవీంద్రబాబును సత్కరిస్తున్న పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

వైభవంగా భావనారాయణుని చక్రస్నానం



సముద్ర తీరంలో చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు



వేలాదిగా హాజరైన మహిళలు

కాకినాడ రూరల్: సర్పవరంలోని రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామికి శుక్రవారం ఉదయం చక్రస్నానం వైభవంగా జరిగింది. ఆలయం నుంచి స్వామి, అమ్మవార్లను ప్రత్యేక వాహనంపై ఊరేగింపుగా తీసుకువచ్చి సూర్యారావుపేట సముద్ర తీరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అర్చకులు వేద మంత్రాల నడుమ చక్రస్నానం చేయించారు. అనంతరం వందలాదిగా తరలి వచ్చిన భక్తులు స్నానమాచరించారు. అర్చకులు స్వామివారి పాదుకలతో శఠగోపంతో ఆశీర్వాచనాలు అందించారు. కల్యాణోత్సవాల్లో భాగంగా పౌర్ణమి సందర్భంగా తెల్లవారు జామున హోమం, మహా పూర్ణాహుతి, ధ్వజారోహణ నిర్వహించారు. వేలాదిగా హాజరైన భక్తులకు పులిహోర, దద్దోజనం, ప్రసాదంగా అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ నారాయణరావు, ఈవో ఉమాశంకర్, గ్రామ నాయకులు పుల్ల చందు, చక్రరావు, భక్తులు పాల్గొన్నారు.

ఖిద్మత్ కమిటీ సేవలు అభినందనీయం

కాకినాడ సిటీ: కుల మతాలకు అతీతంగా కాకినాడ ఖిద్మత్ కమిటీ సేవలను అందించడం జరుగుతుందని కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు చిష్టి, హుస్సేన్ పేర్కొన్నారు. కాకినాడ జగన్నాథపురం గోలీపేటకు చెందిన ఆదిలక్ష్మి అనే యువతికి తల్లిదండ్రులు లేకపోవడంతో ఈ నెల 6న స్థానికులు అండగా నిలచి వివాహం చేయనున్న నేపథ్యంలో ఖిద్మత్ కమిటీ ఆ యువతికి రూ.10 వేల విలువైన బీరువా, మొదటి వస్త్రాన్ని అందజేసింది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అజ్జు, హసన్ షరీఫ్, నౌషాద్, కమిటీ సభ్యులు ఖాజా, ఏహ్తిషాముదల్ హఖ్, హుస్సేన్, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.



ఆదిలక్ష్మికి బీరువా అందజేస్తున్న ఖిద్మత్ కమిటీ ప్రతినిధులు

ఉత్సాహంగా రోటరీ సర్వీస్ మంత్



సమావేశంలో మాట్లాడుతున్న రమణారావు

బోట్‌క్లబ్: యువతను చైతన్యపరిచేలా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు రోటరీ క్లబ్ కాకినాడ యూత్ సర్వీస్ చైర్మన్ టీవీ రమణారావు అన్నారు. స్థానిక కల్పనా సెంటర్‌లోని రోటరీ హాల్‌లో శుక్రవారం రోటరీక్లబ్ కాకినాడ సమావేశం నిర్వహించారు. రోటరీ సర్వీస్ మంత్‌లో చేపట్టే సేవా కార్యక్రమాలను ఆయన వివరించారు. యువత సక్రమ మార్గంలో నడిస్తే దేశం కూడా సక్రమమార్గంలో నడుస్తుందన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు సురభి శారద, క్లబ్ సెక్రటరీ కోనాడ ప్రకాశరావు, క్లబ్ మాజీ గవర్నర్లు పాల్గొన్నారు.

విశాఖ వెళ్లి పింఛన్ అందజేత

కాకినాడ: కాకినాడ 11ఎ సచివాలయం పరిధిలోని డైరీఫారం సెంటర్‌కు చెందిన మునిరుద్దీన్‌కు స్థానిక వలంటీర్ విశాఖ వెళ్లి పింఛను అందజేశారు. ఛాతినొప్పికి గురైన మునిరుద్దీన్ విశాఖపట్నంలో ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో ఆ ప్రాంతానికి చెందిన వలంటీర్ మేరి విశాఖవెళ్ళి ఆయనకు శుక్రవారం పింఛన్ సొమ్ము అందించారు.



విశాఖ ఆస్పత్రిలో వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ మేరి